క్లుప్తంగా

చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ప్రభుత్వం వయో వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన వయో వద్దుల పోషణ, సంరక్షణ చట్టం–2007పై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయస్థానం ఆవరణలోని న్యాయసేవా సాధికార సంస్థ సమావేశ మందిరంలో చట్టంపై అవగాహన సదస్సు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ నర్తు కల్యాణ్ బాబు, రిమ్స్ ఆస్పత్రి మానసిక ఆరోగ్య నిపుణురాలు డాక్టర్ అఖిల, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

12 కోట్ల ఒత్తుల వెలుగులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో కార్తీక ద్వాదశి సందర్భంగా ద్వాదశాదిత్యులకు ఒక్కో కోటి చొప్పున మొత్తంగా 12 కోట్ల ఒత్తులను ఇంద్ర పుష్కరిణి ఒడ్డున వేదమంత్రోచ్చారణల నడుమ బుధవారం వెలిగించారు. విశాఖపట్నానికి చెందిన వ్యాపారవేత్త ముప్పిడి నరేంద్రకుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ వేదపండితుల సమక్షంలో బుధవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

ఇంటర్వ్యూల్లో 55 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హెటిరో ఫార్మా కంపెనీలో ఉద్యోగాల కోసం కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల నుంచి 55 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం జరిగిన అభినందన సమావేశంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంతో జాగ్రత్త



శ్రీకాకుళం కల్చరల్: మధుమేహంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ మధుమేహ, థైరాయిడ్ వైద్య నిపుణురాలు డాక్టర్ కింజరాపు షర్మిళ అన్నారు. నవంబర్ 14న ప్రపంచ మధుమేహ వ్యాధిగ్రస్తుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సుమారు 10 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. మారుతున్న జీవనశైలి, వ్యాయామం చేయకపోవడం, ఒత్తిడి, హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, ఆహారపు అలవాట్లలో మార్పులతో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ జబ్బులు, గ్యాంగ్రీన్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

జమిలి ఆలోచన శుభ పరిణామం

శ్రీకాకుళం: దేశంలో జమిలి ఎన్నికలు జరిపించడానికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలోచన చేయడం శుభ పరిణామమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్రస్థాయి న్యాయ సలహాదారుడు బీన ఢిల్లీరావు, చౌదరి లక్ష్మణరావులు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. జమిలి ఎన్నికలతో పాటు కొన్ని ఐరోపా దేశాల్లో అమల్లో ఉన్న రీకాల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. దీనివల్ల రాజకీయ అవినీతి తగ్గుతుందని, తద్వారా మిగతా వ్యవస్థలన్నీ గాడినపడతాయన్నారు.

గాయత్రికి అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇటీవల నంద్యాలలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో సత్తాచాటిన ముంత గాయత్రిని శ్రీకాకుళంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జామి భీమశంకర్ బుధవారం అభినందించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజయంలో కీలకభూమిక పోషించింది. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు రౌతు శ్రీనివాసరావు, వి.టి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులు సత్తా చాటాలి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ స్థాయిలో క్రీడాకారిణులు సత్తా చాటాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ ఆకాంక్షించారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో జాతీయ స్థాయి వాలీబాల్ జట్టులో స్థానం సాధించిన ప్రీ యూనివర్సిటీ కోర్సు విద్యార్థినులు ఎం.మౌనిక, ఎస్.జీవితలను బుధవారం అభినందించారు.

భక్తజన పరవశం

● దివ్య తేజోమయంగా తెప్పోత్సవాలు
● హంస వాహనం.. భాస్కరుని వైభవం



ధర్మవరం భక్తబృందం కోలాట ప్రదర్శన



ఇంద్ర పుష్కరిణిలో హంసనావికోత్సవం





ప్రత్యక్షదైవం సూర్యుని సాక్షిగా హంసనావికోత్సవం



తిరువీధిగా వస్తున్న ఉత్సవమూర్తులు



హారతులిస్తున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లిలో స్వర్ణాలంకరణ శోభితుడైన సూర్యనారాయణ స్వామివారు ఉషాపద్మినిఛాయాదేవిలతో కలిసి హంస వాహనంపై జలవిహారం చేశారు. పవిత్ర ఇంద్ర పుష్కరిణిలో 12 సార్లు స్వామివారు వాహనంపై విహరించి భక్తులకు సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తిరస్తు అంటూ దీవించారు. బుధవారం సాయంత్రం 4.15 గంటల సమయానికే ఆలయంలోపల నుంచి వెండి సింహ వాహనంపై ఉషాపద్మిని ఛాయాదేవేరులతో సూర్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులు ఊరేగుతూ పుష్కరిణి వద్దకు చేరుకున్నాయి. హంస వాహనంలో ముందుగా గంగా హారతులిచ్చారు. అర్చకులు భాస్కరభట్ల నరసయ్యశర్మ, ఇప్పిలి రంజిత్ శర్మ, సాందీప్‌శర్మ, షణ్ముఖశర్మ, ఫణీంద్రశర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరుల బృందం వేదమంత్రోచ్చారణల మధ్య నావికార్చన, శ్రీచక్రార్చన పూజలు నిర్వహించి వాహనాన్ని 12 సార్లు విహరింపజేశారు. తిరిగి వెండి సింహవాహనంపైనే స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామ మాఢవీధుల్లో ఊరేగించి ఆలయంలోకి చేర్చారు. క్షీరాబ్ది ద్వాదశి వ్రతం అనంతరం అభిషేకార్చనలు, నక్షత్ర హారతి, దీపారాధన, మంత్ర పుష్పం తర్వాత పవళింపు సేవ చేశారు.

హాజరైన ప్రముఖులు..

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సతీమణితో పాటు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ భార్య స్వాతి, వైఎస్సార్ సీపీ నేత, ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, ఆర్డీఓ సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, జిల్లా ఫైర్ అధికారి మోహనరావు, ఏడీఎఫ్ఓ వరప్రసాద్, ఫిషరీష్ డీడీ పి.వి.శ్రీనివాసరావు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జిలు తెలుగు నాగరత్నం, ఉంగటి రమణమూర్తి, దాతలు లాడె చంద్రశేఖర్, కర్రి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేత పుష్కరిణిలో కూర్మనాథుడు



తిరువీధికి వెళ్తున్న స్వామివారు

గార: పవిత్ర కార్తీక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకూర్మనాథుడు శ్వేత పుష్కరిణిలో బుధవారం అమ్మవార్లతో కలిసి తెప్పలపై విహరించారు. ఆలయం నిర్మించిన రెండో శతాబ్ధం నుంచి ఈ నావికా మహోత్సవాన్ని జరపడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం ఉభయ నాంచార్లుతో (శయనబేరం) కలిసి గ్రామ పురవీధుల్లో మేళతాళాలు మధ్య ఊరేగింపు నిర్వహించి, మత్స్యనారాయణ స్వామి మెట్ల వద్ద ముందుగా సిద్ధం చేసిన పది తెప్పలపై వేంచేసింపజేశారు. శ్వేత పుష్కరిణిలో ఐదుసార్లు ప్రదక్షిణ (విష్ణుమూర్తి లక్ష్మీదేవి సమేతంగా పాల కడలిలో విహరించిన విధంగా) చేశారు. ఆలయ ధ్వజ స్తంభం రేవు వద్దకు వచ్చి నైవేద్యాన్ని తీసుకెళ్లి శ్వేత పుష్కరిణి మధ్యలో ఉన్న ఉగ్రనరసింహునికి అర్చకులు నివేదించారు. ఎస్ఐ ఆర్.జనార్దన ఆధ్వర్యంలో 70 మంది పోలీసులు విధుల్లో పాల్గొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, ఆలయ ఈవో జి.గురునాథం, వైస్ ఎంపీపీ అంధవరపు బాల కృష్ణమూర్తి, కైబాడి రాజు, మైగాపు ప్రభాకర్, ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. సతివాడ సర్పంచ్ యాళ్ల నారాయణమూర్తి వందలాది మంది భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పుష్కరిణిలో దీపారాధన చేశారు.

నాగావళిలో శ్రీనివాసుడు



నదిలో విహరిస్తున్న వేంకటేశ్వరస్వామివారు

శ్రీకాకుళమ కల్చరల్: స్థానిక పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం నాగావళి నదిలో బుధవారం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు బూరాడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి, ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో నదీ తీరానికి వేంజేశారు. పిమ్మట భక్తుల సమక్షంలో పుష్పాలు, విద్యుత్ దీపాలు అలంకరించిన నావలో 11 సార్లు స్వామివారిని వేదపండితుల మంత్రాల నడుమ నదిలో విహరింపచేశారు. ఈ సందర్భంగా స్వామివారికి 16 రకాల హారతులు సమర్పించారు. భక్తులు దేవాలయ కమిటీ సరఫరా చేసిన అరటి దవ్వలలో వత్తులను వెలిగించి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిగంగలో హరిహరసుతుడు



తెప్పపై ఊరేగుతున్న అయ్యప్పస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్ప స్వామి తెప్పోత్సవ వేడుకలు నేత్రపర్వంగా బుధవారం జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ నేతృత్వంలో స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఏకాదశ ఛత్రాలతో ఆలయం చుట్టు తిరువీధి నిర్వహించగా, భక్తులు స్వామివారికి మహాకర్పూర హారతి ఇచ్చారు. అనంతరం స్వామివారిని ఆలయ ఈశాన్య భాగంలోని మణిగంగ పుష్కరిణికి తీసుకొచ్చారు. పుష్కరిణిలో స్వామివారిని తెప్పపై చేర్చి అర్చక స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పుష్కరిణి అంతా మూడుసార్లు తిప్పి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహ అర్చకులు కిరణ్‌కుమార్, కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బేటీ బచావో – బేటీ పడావో అంశంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో భాగంగా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి వారిలో హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు, బరువు కొలిచి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే బాలిక విద్యను ప్రోత్సహించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ బేటీ బచావో – బేటి పడావోపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలిసి అత్యవసర ఫోన్ నంబర్ల గోడపత్రిక, కిశోర బాలికా వికాసం అనే మరో గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీఎస్‌డీవో శ్రీధర్, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య



చిన్నారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేట గ్రామానికి చెందిన మొదలవలస చిన్నారావు (33) విధి నిర్వహణలో ఉంటూ రాజస్థాన్ రాష్ట్ర బికనీర్ రెజిమెంట్ వద్ద బుధవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడి అధికారులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. డ్యూటీలో ఉంటూ మధ్యలో గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరిపోసుకున్నట్లు సమాచారం. బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణం పోయింది. గౌరీ పౌర్ణమి వేడుకలకు సెలవుపై వచ్చి ఈనెల 4వ తేదీన వెళ్లిన వ్యక్తి మృతి చెందాడన్న విషయాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. భార్య సులోచన ఫరీదుపేటలో ఉంది. మృతునికి ఏడాది కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. అక్కడి అధికారులు మృతదేహాన్ని అంత్యక్రియలు కోసం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. 15వ తేదీ నాటికి మృతదేహం తీసుకొచ్చే అవకాశం ఉందని స్థానిక విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు అంచనా వేస్తున్నారు.

పెట్రోల్ పోసిన మేనేజర్ పరారీ



బాధితుడితో మాట్లాడుతున్న సంస్థ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ప్రకాష్‌నగర్‌లో ఈ నెల 9న చిట్స్ కస్టమర్‌పై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన శ్రీరామ్ చిట్స్ మేనేజర్ ఆర్.మణికంఠ పరారీలో ఉన్నట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ముగ్గురు వ్యక్తులతో కలిసి వచ్చిన మేనేజర్ మణికంఠ ఇంట్లో చొరబడి తనపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడటమే కాక బెదిరింపులు, తీవ్ర దుర్భాషలాడి తన భార్య రమని, తనను తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారని ఈ నెల 9న కరకవలస సత్యనారాయణ దంపతులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా, డివిజనల్ మేనేజర్, ఏజెంట్‌తో కలిసి బాధితుడితో స్టేషన్ ఆవరణలోనే రాజీయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే సెటిల్మెంటుకు ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని, పోలీసుల తీరు విస్మయాన్ని గురిచేస్తోందని, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.

ఎస్‌బీఐ గేటు వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

గార: మండల కేంద్రంలోని గార స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద రెండో రోజు బంగారం కుదవపెట్టిన ఖాతాదారులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం బ్యాంకు తెరిచిన సమయానికి చేరుకున్న పలువురు మెయిన్‌గేట్ మూసేసి అక్కడే కూర్చొని నినాదాలు చేశారు. మా బంగారం మాకు ఇప్పించండి, అధికారులు వచ్చి సమాధానాలు చెప్పాలి, లేదంటే మాకు ఆత్మహత్యలే శరణ్యమని నినాదాలు చేశారు. బ్యాంకు సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు వచ్చి బ్యాంకు కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా చూశారు. ఎస్ఐ ఆర్.జనార్ధన, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్, కొందరు ఖాతాదారులను బ్యాంకులోనికి తీసుకెళ్లి అధికారులతో మాట్లాడించారు. డిసెంబర్ 2వ తేదీ నాటికి ఖాతాదారులందరి బంగారం ఇస్తామని అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ రామరాజు తెలియజేశారు.

స్థల వివాదంలో ఆరుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రణస్థలం: జి.సిగడాం మండల కేంద్రానికి చెందిన నాయిని సూర్యనారయణ, నాయిని శివన్న అనే కుటుంబాల మధ్య జరిగిన స్థల వివాదంలో ఆరుగురిని అరెస్టు చేసినట్లు జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. బుధవారం జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో జి.సిగడాం, జె.ఆర్.పురం ఎస్సైలు మధుసూధనరావు, చిరంజీవిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జి.సిగడాంలో సర్వే నెంబర్ 119–21లో 33 సెంట్ల స్థల వివాదం రెండు కుటుంబాల మధ్య కొనసాగుతోందని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 11న నాయిని సూర్యనారాయణ, వెంకటరావులపై మరో వర్గానికి చెందిన శివన్న, లక్ష్మణరావు, సీతం నాయుడు, శంకరరావు, గోపి, రాజు దాడి చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వీరిని బుధవారం అరెస్టు చేసి రాజాం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

నాలుగు ఇసుక లారీలు సీజ్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద నాలుగు ఇసుక లారీలను బుధవారం ఉదయం పట్టుకున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ఎటువంటి రసీదు లేకుండా అక్రమంగా ఇసుకను విశాఖపట్నం తరలిస్తున్నారని చెప్పారు. లారీలను జి ల్లా మైన్స్ శాఖకు అప్పగించామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సు (ఐటెప్)లో మిగులు సీట్లలో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీఈడీ, బీఏబీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్ష స్కోరు కార్డు అవసరమని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20లోపు వర్సిటీలో సంప్రదించాలని సూచించారు.

15 నుంచి ఎల్ఎల్‌బీ తరగతులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతిరావు పులే న్యాయ కళాశాలలో ఈ నెల 15 నుంచి ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు తరగతులు ప్రారంభమవుతాయని కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.రాజేంద్ర ప్రసాద్ బుధవారం చెప్పారు. లాసెట్ – 2024 మొదటి కౌన్సెలింగ్‌లో 66 సీట్లకు 40 ప్రవేశాలు జరిగాయని తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గూనపాలెంలో బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో హైవోల్టేజ్ కారణంగా పలువురి ఇళ్లల్లో గృహోపకరణాలు కాలిపోయాయి. సెల్‌ఫోన్ చార్జర్లు పేలిపోవడంతో పాటు టీవీలు, ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు ఉసూరుమన్నారు.

పరామర్శలు



జి.సిగడాం: ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మీసాల సత్యవతి అత్త, మండల పరిషత్ ప్రత్యేకహ్వానితుడు మీసాల వెంకటరమణ తల్లి అదిలక్ష్మి మృతి చెందింది. దీంతో సమాచారం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి అదిలక్ష్మి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీలు కాయల రమణ, టొంపల సీతారాం, రొక్కం బాలకృష్ణ, దండాన రాజినాయుడు, సర్పంచ్ బాలి రమేష్, జేసీఎస్ కన్వీనర్లు డోల వెంకటరమణ, శిల్లా వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అదపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అర్జునరావు మాత్యమూర్తి మరణించడంతో వారి కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గొర్లె అప్పలనాయుడు, ప్రభాకరరావు, మధు నర్సయ్య, భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మైలపల్లి రాముడు విశాఖపట్నంలో ఇటీవల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల వైఎస్సార్ సీపీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, పిన్నింటి లక్ష్మునాయుడు, సర్పంచ్ అల్లిపల్లి అప్పన్న, గ్రామ నాయకులు సత్యరాజు, యర్రయ్య, రాముడు, సూరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మెస్‌లో చోరీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని డేఅండ్‌నైట్ కూడలిలో సింధూర హాస్పిటల్ వద్ద నాయుడు మెస్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు అద్దాలు పగులగొట్టి, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కౌంటరులో ఉన్న రూ.20 వేలు నగదు పట్టుకుపోయారు. యజమాని జి.వి.నర్సింహమూర్తి బుధవారం ఉదయం వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐ వద్ద ప్రస్తావించగా సమాచారం తెలిసిందని, సమీపంలో సీసీ టీవీ పుటేజ్, ఆధారాలు సేకరించాల్సి ఉందన్నారు.

జీడీప కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: జీడీప కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా స్త్రైవ్ సౌజన్యంతో నిర్వహించే ఈ కోర్సులో చేరేందుకు 18 నుంచి 30 ఏళ్ల వయసు, ఇంటర్ పాస్/ఫెయిల్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ పాసైన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు కార్పొరేట్ ఆసుపత్రిల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన వారికి డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సిక్కోలు అ'ద్వితీయం'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడా జట్లు సత్తాచాటుతున్నాయి. తాజాగా బేస్‌బాల్ పోటీల్లో అద్వితీయమైన ఆటతీరుతో విజయదుందుభి మోగించాయి. గుంటూరు వేదికగా జరిగిన అండర్–17 బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బాలురు విభాగంతోపాటు బాలికల విభాగంలోనూ ద్వితీయ స్థానంలో నిలిచి మోత మోగించాయి.

స్విమ్మింగ్‌లో పతకాల మోత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల మోత మోగించారు. గోదావరి స్విమ్మింగ్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీకాకుళం మాస్టర్ స్విమ్మర్లు 21 బంగారు, ఒక రజిత, రెండు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు.

జయప్రదం చేయాలి

గార: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పాఠకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి ఎన్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమాల్లో డ్రాయింగ్ పోటీలు, పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు వంటివి నిర్వహిస్తామన్నారు.